అర్హులకు సబ్సిడీ రుణాలు అందేనా..!

- గంపెడాశలు పెట్టుకున్న లబ్ధిదారులు
- రుణాల కోసం కూటమి నేతల పైరవీలు
- సామాన్యుల్లో సన్నగిల్లుతున్న ఆశలు


సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు(ఫైల్)

సింహాద్రిపురం : ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇటీవల స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు నిరుద్యోగులు హాజరై తమ విద్యార్హత సర్టిఫికెట్లతోపాటు తాము చేయబోయే వ్యాపారాలను అధికారులకు వివరించారు. రుణం అందిస్తే తాము ఉపాధిని ఏర్పరచుకోగలమంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ రుణాలపై గంపెడాశలు

రుణం అందుతుందని నిరుద్యోగులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. అయితే పదుల చొప్పున యూనిట్లు మంజూరైతే దరఖాస్తులు మాత్రం వందల్లో వచ్చాయి. దీంతో పలువురు దరఖాస్తుదారులు స్థానికంగా ఉండే కూటమి నాయకుల చుట్టూ రుణాలు ఇప్పించాలని ప్రదక్షిణలు చేస్తున్నారు. యూనిట్ల కేటాయింపు జరిగిన రోజు నుంచే సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం పెరిగిపోయింది. దీంతో అర్హతలు ఉన్న సామాన్యులు సైతం ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు కూటమి పార్టీలు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా హామీల అమలు ఊసే లేదు. ఇప్పటికే ఆరు హామీలు అమలు చేయకపోవడంతో సామాన్య ప్రజలు కూటమి ప్రభుత్వంపై రగిలిపోతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సింహాద్రిపురంలో 30 సబ్సిడీ రుణ యూనిట్లు మంజూరు కాగా.. 353 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వీటిని బీసీలు, కాపు, ఈడబ్ల్యూఎస్ కింద ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కేటగిరీలుగా విభజించి కేటాయించారు. నామమాత్రంగా సబ్సిడీ రుణ యూనిట్లు కేటాయించడంతో నిరుద్యోగ యువత అసహనం వ్యక్తం చేస్తోంది. యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉన్న ఈ రుణాలను దక్కించుకునేందుకు అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు పలుకుబడి ఉన్న వారి చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు.


సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

సబ్సిడీ రుణాలకు పెరిగిన పోటీ

ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ రుణ యూనిట్లు అంతంతమాత్రంగానే ఉండడం, గ్రామాల నుంచి దరఖాస్తులు వందల్లో రావడంతో తీవ్ర పోటీ నెలకొంది. అధికార పార్టీ వారిని దాటుకుని తమకు రుణాలు రావడం అసాధ్యమని నిర్ణయించుకుంటున్నారు. దరఖాస్తు చేశామని, ఓ ప్రయత్నం చేస్తే పోదా అన్నట్లుగా మరికొందరు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. సుమారు రూ.500లకుపైగా ఖర్చు చేసి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత చదువులు అభ్యసించి ఖాళీగా ఉన్న యువతకు ప్రాముఖ్యత ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గల్పర్ సేవలు వినియోగించుకోండి

కమలాపురం : పట్టణ ప్రజలు నగర పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గల్పర్ (సెప్టిక్ ట్యాంక్ క్లీనర్) సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పురి మేరీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్పర్ వాహనం ఒక ట్రిప్పుకు ప్రైవేట్ వారు రూ.3 వేలు వసూలు చేస్తారని, అదే మున్సిపల్ వారు ఒక ట్రిప్పుకు కేవలం రూ.2 వేలు మాత్రమే వసూలు చేస్తారని ఆమె తెలిపారు. పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి చెందిన గల్పర్ వాహనం వినియోగిస్తే డబ్బు తగ్గడంతో పాటు పట్టణ అభివృద్ధికి సహకరించిన వారు అవుతారన్నారు. పట్టణ ప్రజలు తప్పని సరిగా మున్సిపల్ సిబ్బంది ద్వారా గల్పర్ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

బస్సు నిలపలేదని డ్రైవర్‌పై దాడి

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఆలంఖాన్‌పల్లె సమీపంలో ఆర్టీసీ బస్సును నిలపలేదని అదే ప్రాంతానికి చెందిన కృష్ణారెడ్డి అద్దె బస్సు డ్రైవర్ వేలూరు బాలయ్యపై చెప్పుతో దాడి చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలి

ముద్దనూరు : రైతులు రసాన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బడుగువారిపల్లె, ఆరవేటిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏవో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి సాగుచేసిన అలసంద పంట పొలాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. కంది పంట సాగుచేసి రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని కందులను అమ్ముకోవాలని సూచించారు.

విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్

వేంపల్లె : రాయలసీమ జోనల్ స్థాయిలో జరిగిన అబ్యాకస్ ఒలంపియాడ్‌లో ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఆర్కే ఎడ్యుటెక్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఒలంపియాడ్ పోటీలు జరిగాయి. ఒలంపియాడ్ పోటీల్లో ఏ కేటగిరీలో ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు హేమంత్, శివ కార్తీక్ జోనల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, వెంకట భవ్యశ్రీ, వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచి బహుమతులను, జ్ఞాపికలను, సర్టిఫికెట్లను అందుకున్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు కరస్పాండెంట్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య

ఎర్రగుంట్ల : మండలంలోని హనుమనుగుత్తి గ్రామంలో పర్యటించిన ఎంపీడీవో వెంకటరమణయ్య గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై ప్రాముఖ్యతపై వివరించారు. చెత్తను బహిరంగంగా పడేయకుండా గ్రామ పంచాయతీ అందించిన చెత్తడబ్బాల్లో వేయాలన్నారు. వేసవి కాలంలో గ్రామంలో నీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు.

రాష్ట్రస్థాయి చేతిరాత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు

తొండూరు : రాష్ట్రస్థాయి చేతిరాత పోటీల్లో తొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ పాఠశాల హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ పోటీలలో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు బెస్ట్ హ్యాండ్ రైటింగ్ అవార్డులు, మరో 7 మంది విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ మెరిట్ సర్టిఫికెట్లు పొందారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం: ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని శ్రీనివాస నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆశా వర్కర్లతో జరిగిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులందరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. ప్రొద్దుటూరు అర్బన్ నుంచి ఇప్పటి వరకూ ఒక్క క్యాన్సర్ కేసు రెఫర్ కాలేదని తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించడంలో నిర్లక్ష్యం పనికి రాదని, కొన్ని సచివాలయాల పరిధిలో తక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. త్వరలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో బాల భవిత కేంద్రం ఉన్నట్లు చాలా మందికి తెలియదని, పుట్టిన పిల్లల మొదలు 18 ఏళ్ల వారికి అక్కడ అధునాతన వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు.

అక్రమ కట్టడాలు ఆపాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన హిందూ ఐక్యవేదిక సభ్యులు

వల్లూరు (చెన్నూరు) : స్థానిక ట్రంకు రోడ్డులోని ఓ ప్రార్థనామందిరం ఆవరణలో జరుగుతున్న అక్రమ కట్టడాలను వెంటనే ఆపాలని హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మంగళవారం హిందూ ఐక్యవేదిక పిలుపుమేరకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న పార్కులో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అక్రమ కట్టడాల వల్ల జనజీవనానికి కలిగే ఇబ్బందుల గురించి సమావేశంలో చర్చించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్లి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనకు దిగారు. అక్రమ కట్టడాల వల్ల ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అంతరాయాలు తరచూ జరుగుతుంటాయని అలాగే తూర్పు భాగంలోని ఉత్తర దిశగా నిర్మిస్తున్న కట్టడాల వల్ల హిందూ దేవతామూర్తులు గ్రామోత్సవాలకు ఆటంకాలు ఎదురవుతాయన్నారు. హిందూ ఆలయాల స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని వీటిని వెంటనే రెవెన్యూ అధికారులు కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాణిజ్య అవసరాల కోసం అక్రమ కట్టడాలు నిర్మించడం సబబు కాదన్నారు. గ్రామ పంచాయతీ అనుమతులు లేవంటూ కట్టడాలు ఆపాలని పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ అక్రమ కట్టడాలు సాగిస్తున్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సరస్వతికి అందజేశారు. ఆమె జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇరు వర్గాల సమస్యలన్నిటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జమ్మలమడుగు రూరల్ : స్థానిక ఎస్పీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గౌరీదేవి బలిజ మహిళా సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షురాలు ఉషాదేవి తెలిపారు. మంగళవారం ఒక ప్రైవేట్ పాఠశాలలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు లక్కీ కూపన్ ద్వారా ఎంపిక చేసి మొదటి బహుమతి ఒక గ్రాము బంగారం, 2వ బహుమతి వెండి, 3వ బహుమతి వెండి, కుంకుమ భరణి అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కార్యదర్శులు, ప్రముఖులు పాల్గొంటారన్నారు.

పౌష్టికాహారం మహిళలకు ఎంతో అవసరం


పోషకాహారం గురించి అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు సునీత

చింతకొమ్మదిన్నె : అంతర్జాతీయ మహిళాదినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక కేంద్రంలో ఆరోగ్యకరమైన మహిళలు, సంతోషకరమైన మహిళలు అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలకు పౌష్టికాహారం, హెల్త్ డైట్, యోగ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యురాలు సునీత, ఆరోగ్య అధికారులు, ఉపాధి ఏపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, లక్ష్మిదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌ఎంసీ నిబంధనల అమలు పట్టదా..?

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్యకళాశాలలో వైద్య విద్యను పూర్తి చేసుకున్న హౌస్‌సర్జన్‌లకు సరైన శిక్షణ లేకుండా పూర్తి వైద్యులుగా గుర్తించడం సరికాదని ప్రభుత్వ మానసిక వైద్యశాల (ఐఎంహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. వెంకటరాముడు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్ సర్జన్‌లు వారి సంవత్సర కాలంలో రెండు వారాలు మానసిక వైద్య విభాగంలో పనిచేసే అనుభవం గడించటం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్.ఎం.సీ) నిబంధనల ప్రకారం తప్పనిసరి అన్నారు. కానీ ఈ మార్గదర్శకాలను తుంగలో తొక్కి, అసలు వారిని మానసిక విభాగం వైపు కన్నెత్తిఅయినా చూడకుండా గత నాలుగు సంవత్సరాలుగా ఎం.బి.బి.ఎస్ అభ్యసించే వారికి వైద్య పట్టాలు ఇస్తున్నారు. సరైన శిక్షణ లేకుండా వారిని పూర్తి వైద్యులుగా మెడికల్ కౌన్సిల్ గుర్తించడం తగదన్నారు. మానసిక సమస్యలు రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో ఈ వివక్ష ప్రమాదకరమైన హెచ్చరిక అని పేర్కొన్నారు. ఈ మానసిక సమస్యలపై పూర్తి అవగాహన లేకపోవడంతో త్వరగా మానసిక జబ్బులను గుర్తించే నైపుణ్యం కోల్పోతున్నారన్నారు.

తెలుగు సాహితీ యాత్రలో పాల్గొనండి

కడప సెవెన్‌రోడ్స్ : తాము జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలుగు సాహితీ యాత్రలు, మహా కవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను ఆహ్వానించామని సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా హను మంతరావు మాట్లాడుతూ సాహితీ యాత్రలలో భాగంగా ఈనెల 25వ తేదీ కలెక్టర్ తమ ఆహ్వానంపై బద్వేలుకు రానున్నారని తెలిపారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ

వల్లూరు : అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను వినిపించారు. తాగునీటి సరఫరా కోసం తమ గ్రామ పంచాయతీల్లో తాము ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన బిల్లులను ఇంత వరకు ఇవ్వలేదని, బిల్లులు ఇవ్వకుంటే మేమెలా గ్రామాల్లో ప్రజలకు నీటిని అందించాలని పైడికాలువ సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించడంలో తమపై అధికారులు ఒత్తిడి చేస్తారని, గ్రామాల్లో జరిగే అభివృద్ధి, ఇతర నిధులకు సంబంధించిన పనులను మాత్రం టీడీపీ కార్యకర్తలకు కేటాయిస్తారని, అలాంటప్పుడు అధికారులు తమపై ఒత్తిడి చేయడం మానుకోవాలని కొట్లూరు సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి, రెండు చోట్ల వీధి దీపాలు వెలగనప్పుడు వాటిని మరమ్మతు చేయడంలో విద్యుత్ శాఖ సిబ్బంది సహకరించాలని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ విడుదలైందని, ఇందులో స్థానిక మండలానికి ప్రథమ ప్రాధాన్యత వుంటుందని, సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో రఘురాం, డీటీ లక్ష్మి, ఈవోపీఆర్‌డీ శ్రీధర్, ఎంపీటీసీలు రామకృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, ఏవో సాయి జ్యోతి, ఏపీవో సుధారాణి, ఏపీఎం యామినీ పూర్ణిమ, సీహెచ్‌వో వేణుగోపాల్‌రావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ పనిముట్లకు దరఖాస్తు చేసుకోండి


దాదిరెడ్డిపల్లెలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : సబ్సిడీ పనిముట్లకు ఆసక్తి గల రైతులు ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని దాదిరెడ్డిపల్లె, వంకమాడ గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి కొర్ర, మినుము, వేరు శనగ పంటలను పరిశీలించారు. వేరుశనగలో సూక్ష్మ ధాతు మిశ్రమ ఎరువులైన ఫార్ములా 4 లేదా గ్రోత్ లేదా మ్యాక్స్ ఏకరాకు కిలో మిశ్రమాన్ని పంట వేసిన 30-40, అలాగే 60-70 రోజులలో పిచికారి చేసుకుంటే సూక్ష్మ ధాతు లోపాన్ని నివారించవచ్చన్నారు. సబ్సిడీ పనిముట్లు కావలసిన రైతులు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఇ-పంట నమోదు, ఇ-కేవైసీకు ఈనెల 6వ తేదీకి వరకు గడువు ఉందన్నారు. రైతులు తప్పని సరిగా పంట నమోదు, కేవైసీ తప్పని సరిగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఆర్‌ఎస్‌కేలో 7 నుంచి 11వ తేదీ వరకు సోషల్ ఆడిట్ కోసం ఇ-పంట నమోదు వివరాలను అందుబాటులో ఉంచుతామన్నారు. వాటిపై 13 నుంచి 18 వరకు గ్రీవెన్సులు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఏఏ బాబు, రైతులు పాల్గొన్నారు.

కోటి గోటి తలంబ్రాల దీక్ష


తలంబ్రాలను తయారు చేస్తున్న భక్తులు, భజన బృందాలు

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల అప్పస్వామి ఆలయంలో మంగళవారం ఏప్రిల్ నెలలో జరిగే శ్రీభద్రాది సీతారామ కల్యాణ ఉత్సవానికి కోటి గోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ అర్చకులు మురళీమోహన్ శర్మ, లక్ష్మీ ప్రసన్న దంపతులు ఆధ్వర్యంలో భద్రాది నుంచి వచ్చిన వడ్లను ఒలిచి రాముని కొలువు అనే నినాదంతో భద్రాద్రిలో జరిగే సీతారామ కల్యాణానికి తలంబ్రాలుగా పంపిస్తారు. ప్రతియేటా భూపాలపల్లె జిల్లా చెల్‌పూర్ గ్రామం రామదాసు భక్తిమండలివారు తిరుపతమ్మ, తిరుపతయ్య దంపతులు తమ సొంత పొలంలో వడ్లు పండించిన వడ్లను పోస్టు ద్వారా వివిధ గ్రామాలకు పంపి బియ్యం తలంబ్రాలు చేస్తారు. కార్యక్రమంలో గురిజాల గ్రామ భజన బృందాలు, భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొని వడ్లను ఒలిచి తలంబ్రాల బియ్యాన్ని తయారు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యం పెంపొందించుకోవచ్చు


మాట్లాడుతున్న ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్

సింహాద్రిపురం : ప్రతిరోజు విద్యార్థులు న్యూస్ పేపర్లు చదవడంవల్ల విద్యా నైపుణ్యం పెంపొందించుకోవచ్చునని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శ్రీవివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం నిర్వహించిన మహిళల భద్రతపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి న్యూస్ పేపర్లను చదవాలని, సెల్‌ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడటం విద్యార్థుల భద్రతకు ముప్పు సంభవిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు మహిళల భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ఈనెల 8వ తేదీన ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు : వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని సన్న, చిన్నకారు రైతులకు ఎస్సీ, ఎస్టీ మహిళ రైతుకు ప్రాధాన్యత కల్పిస్తూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద వివిధ రకాల యంత్ర పరికరాలను సబ్సిడీపై పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇ-పంటలో నమోదైన రైతులు ఐదు సంవత్సరాల నుంచి ఎలాంటి సబ్సిడీ పొందని, రైతులు భూసార పరీక్ష చేయించుకున్న రైతులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకం కింద చేతి పంపులు బ్యాటరీ స్ప్రేయర్లు , పవర్‌స్ప్రేయర్లు చరోట వేటర్లు పవర్‌విడర్‌లు, గొర్రు, గుంటక, విత్తన గొర్రు లాంటి ట్రాక్టర్ పరికరాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తారన్నారు. అర్హులైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో రాహు కాల పూజలు



కడప కల్చరల్ : విజయదుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సాయంత్రం రాహుకాల పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చక బృందం అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంగళకరమైన అలంకారం చేసి భక్తులను దర్శనాలకు అనుమతించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళలు స్వావలంబన సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ముద్దనూరు : మహిళలు అన్ని అడ్డంకులను అధిగమించి స్వావలంబన సాధించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఆయన ఐసీడీఎస్ మహిళలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళలు ఆహారం , ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఐసీడీఎస్ సిబ్బంది ఇతర మహిళలకు ఆరోగ్యం, ఆహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం చిరుధాన్యాలతో సిబ్బంది తయారు చేసిన వంటకాల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో ఉత్సాహభరితంగా క్రికెట్ పోటీలు


విజేతగా నిలిచిన జట్టుతో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, క్రీడ శాస్త్రాల విభాగాధిపతి రామసుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ కాలేజ్ డే, ఫౌండేషన్ డే సందర్భంగా కళాశాల అంతర విభాగ క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం జరిగిన బోధన సిబ్బంది క్రికెట్ ఫైనల్ పోటీలను ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో వైవీయు పరీక్షల నియంత్రణ అధికారి ప్రో. కె ఎస్ వి కృష్ణరావు కెప్టెన్ గా వ్యవహరించిన జట్టు విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో మాజీ రిజిస్ట్రార్ డి.విజయ రాఘవ ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టు నిలిచింది.

దోసకు గిరాకీ



దోస కాయలకు గిరాకీ పెరిగింది. ఎండలు పెరిగిన నేపథ్యంలో చల్లదనం కోసం దోసకాయలు తినడానికి చాలా మంది ఇష్టపడతారు. పెన్నానదీ పరివాహక ప్రాంతంలో దోస పంట ఎక్కువగా సాగు చేశారు. కొందరు తోటల వద్దకే వచ్చి కాయలను తీసుకెళుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప